సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 25 । అక్టోబర్ । 2023





## అన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి జీవీవీ రమేష్ (రాజమహేంద్రవరం) సోమవారం రూ.10,116 విరాళం అందజేశారు.



## కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పుడెల్టాకు 4,900, మధ్యడెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,200 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటి మట్టం కొనసాగుతోంది.

## ఏడీబీ రోడ్డులో భారీ ప్రమాదం



విజయదశమి రోజున పెద్దాపురం ఏడీబీ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రెండు ట్రాలీ వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటన సోమవారం అర్ధరాత్రి పెద్దాపురం-రాజమహేంద్రవరం రోడ్డులో చోటు చేసుకోవడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

8లో

# న్యూస్‌రీల్

## ప్రత్యేక బస్సులు సిద్ధం



బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం సిటీ: దసరా సెలవులు ముగియడంతో జిల్లా నుంచి హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిలాఅశోక మంగళవారం తెలిపారు. జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు డిపోల నుంచి నాలుగు సూపర్ లగ్జరీ, ఒక ఇంద్ర బస్సు కలపి మొత్తం ఐదు బస్సులు హైదరాబాద్‌కు రోజూ వెళ్తున్నాయన్నారు. తిరుగు ప్రయాణికుల కోసం రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు మంగళవారం మరో మూడు సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సులను సిద్ధం చేశామన్నారు. వీటితో పాటు విశాఖపట్నం, విజయవాడ ప్రయాణికుల కోసం రోజుకు పది ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని అన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు డీపీటీఓ ప్రకటించారు. ఈ ప్రత్యేక బస్సులు 29వ తేదీ ఆదివారం వరకూ నడుస్తాయన్నారు.

## నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను బుధవారం పలు గ్రామాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ మాధవీలత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బిక్కవోలు మండలం తొస్సిపూడి, చాగల్లు మండలం కలవలపల్లి సచివాలయం-2, దేవరపల్లి మండలం త్యాజంపూడి-1, గోకవరం మండలం రంపయర్రంపాలెం-2, కడియం మండలం కె.సావరం-2, కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం, నల్లజర్ల మండలం పోతవరం-1, పెరవలి మండలం ఉసులుమర్రు, రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యి-1, రాజానగరం మండలం భూపాలపట్నం-1, రంగంపేట మండలం జి.దొంతమూరు-1, సీతానగరం మండలం బొబ్బిల్లంక-1, తాళ్లపూడి మండలం పెద్దేవం-1, ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను, రాజమహేంద్రవరం అర్బన్ యూపీహెచ్‌పీ పరిధి అంబేడ్కర్‌నగర్, ఆనంద్‌నగర్, కంబాలపేట, మెరకవీధి, సారంగధరమెట్ట వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తారని వివరించారు.

## నేషనల్ గేమ్స్‌కు గోవిందరాజు




నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి హోదాలో జిల్లా ఒలింపిక్ సంఘ చైర్మన్ చుండ్రుగోవిందరాజు గోవాలో జరిగే జాతీయ క్రీడలకు మంగళవారం వెళ్లారు. జిల్లా నుంచి ఈ హోదాలో జాతీయక్రీడలకు మొదటి సారి గోవిందరాజు హాజరవుతున్నారు. అక్టోబరు 26 నుంచి నవంబరు 9 వరకు ఈ క్రీడలు జరగనున్నాయి. 58 సంవత్సరాల క్రీడానుభవం కల్గిన గోవిందరాజు ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా ఒలింపిక్ సంఘానికి అధ్యక్షునిగా సేవలు అందించారు. అథ్లెటిక్స్, ఖో-ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లో ప్రావీణ్యముంది. 1969-70లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ తరుపున ఖో-ఖోకు ప్రాతినిధ్యం వహించారు. 25 సంవత్సరాలుగా షటిల్ బ్యాడ్మింటన్, 20 సంవత్సరాలుగా ఒలింపిక్ సంఘంలో వివిధ హోదాల్లో పనిచేసి జిల్లా క్రీడాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. బ్యాడ్మింటన్‌లో 4 సార్లు జాతీయస్థాయిలో, ఒకసారి అంతర్జాతీయస్థాయిలో (స్పెయిన్)లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘ సిఈఓ హోదాలో జాతీయ క్రీడలకు హాజరవుతున్న గోవిందరాజుకు జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, మాజీ ఒలింపిక్ సంఘ చైర్మన్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి, ఒలింపిక్ సంఘ కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషాబాబు, చీఫ్‌ప్యాట్రన్ కర్రిభామిరెడ్డి, సభ్యులు బి.కృష్ణమూర్తి, రవిరాజు తదితరులు మంగళవారం కాకినాడలో శుభాకాంక్షలు తెలిపారు.

## బాలాత్రిపుర సుందరి దేవికి వెండి చీర అలంకరణ



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో నిర్వహించిన శరన్నవ రాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఆలయంలోని అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారిని సోమవారం 9వ రాజు అలంకరణగా రాజరాజేశ్వరీ అలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి వెండి చీర అలంకరణ చేశారు.

# పాడి పరిశ్రమకు చేదోడు





ఆవుల డెయిరీ ఫాం

- పశుపోషణకు పెద్ద పీట వేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- జాతీయ లైవ్ స్టాక్ మిషన్‌తో ఒకవైపు పాడి, మరోవైపు మాంసం ఉత్పత్తి
- యూనిట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రాయితీ
- రైతులతోపాటు నిరుద్యోగ యువతి... మహిళలకు మేలు

**పశువులు, కోళ్లు, ఇతర జీవాల వివరాలు**

| | | |
|---|---|---|
| ఆవులు | : | 74,778 |
| గేదెలు | : | 1,93,847 |
| గొర్రెలు | : | 1,71,263 |
| మేకలు | : | 69,265 |
| పందులు | : | 2,080 |
| కోళ్లు | : | 2,13,75,656 |





సాక్షి అమలాపురం: ''పాడి – పంట''... అంటారు. ఆ రెండు ఉన్నప్పుడే వ్యవసాయం లాభసాటి. కూలీల కొరత, వివిధ కారణాలతో రెండు, మూడు దశాబ్దాలుగా డెల్టా, మెట్ట ప్రాంతాలకు చెందిన రైతులలో చాలామంది పాడికి దూరమవుతున్నారు. నాటి నుంచి వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకుంటున్న రైతు అనుకూల విధానాల వల్ల పండిన పంటలకు గిట్టుబాటు ధర వస్తున్నప్పటికీ వ్యవసాయం పెద్దగా లాభసాటి కావడం లేదు. దీనిని గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పశుపోషణకు పెద్ద పీట వేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (జాతీయ పశు అభివృద్ధి పథకం) ద్వారా పశు పోషణను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇలా చేయడం ద్వారా రైతులకు మేలు చేయడమే కాకుండా నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని జిల్లా యంత్రాంగం ఆశిస్తోంది.

### పలు రకాలుగా మేలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి డెల్టాతోపాటు మెట్ట ప్రాంతాలు పాడిపంటలకు ఆలవాలం. వ్యవసాయ, ఉద్యాన పంటలతోపాటు ఆవులు, గేదెలు, పెరటి కోళ్లు ఉండటం వల్ల రైతులు సమీకృత వ్యవసాయంలో ఆదాయం పొందేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కానరావడం లేదు. వరి, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు పాడిని వదిలేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో అనపర్తి, మండపేట, రామచంద్రపురం, కరప, రాజానగరంతో పాటు గోదావరి లంక గ్రామాల్లో కొంతవరకు పాడి ఉంది. మండపేట, కొత్తపేట, పెద్దాపురం, రాజానగరం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాలలో కోళ్ల పెంపకం జరుగుతోంది. కోనసీమ, కాకినాడ జిల్లాలతో పోల్చుకుంటే తూర్పు గోదావరి జిల్లాలో కోళ్ల పెంపకం అధికం. కొన్ని రకాల కులవృత్తుల వారు మాత్రమే గొర్రెలు, మేకలు, పందులను పెంచుతున్నారు. అంతేకానీ వీటిని పెద్ద ఎత్తున పెంపకం చేపట్టడం ద్వారా ఆదాయం పొందుతున్న దాఖలాలు లేవు. జాతీయ పశు అభివృద్ధి పథకం ద్వారా వివిధ రకాల జీవాలను పెంచడం వల్ల ఆయా వర్గాలకు మాత్రమే కాకుండా స్థానికంగా పాడి ఉత్పత్తి పెంచడంతోపాటు మాంసం ఉత్పత్తి సైతం పెరుగుతుంది. దీని వల్ల ప్రత్యక్షంగా పెంపకందారులే కాకుండా పరోక్షంగా అమ్మకందారులకు సైతం మేలు జరుగుతుంది. మేలు రకం మాంసం విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం కూడా ఉంది.

## జాతీయ పశు అభివృద్ధి పథకంలో రాయితీలు అందేది ఇలా..

- జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకానికి కేంద్రం ప్రభుత్వం 50 శాతం వరకు రాయితీగా అందిస్తోంది.
- గొర్రెలు, మేకలు పెంపకం యూనిట్‌లో 100 గొర్రెలు లేదా మేకలకు ఐదు పొట్టేళ్లు, లేదా మేకపోతులకు రూ.10 లక్షల వరకు రాయితీ ఇస్తారు. 200 యూనిట్‌కు రూ.20 లక్షలు, 300 యూనిట్‌కు రూ.30 లక్షలు, 400ల యూనిట్‌కు రూ.40 లక్షల వరకు రాయితీ ఇస్తారు. 500 గొర్రెలు లేక మేకలు, 25 పొట్టేళ్లు, లేక మేక పోతులకు యూనిట్ ధర రూ.కోటి వరకు, అంతకన్నా ఎక్కువ విలువైనా రూ.50 లక్షల వరకు రాయితీగా అందిస్తారు.
- పశువులకు మేలైన పశుగ్రాసాలు, నాణ్యమైన దాణా అందించేందుకు సైలేజ్ తయారీ యూనిట్, పశుగ్రాస తయారీ యూనిట్, సమీకృత దాణా తయారీ యూనిట్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. రూ.కోటి విలువైన, అంతకు మించిన విలువైన ప్రాజెక్టుకు రూ.50 లక్షల వరకు రాయితీ వస్తోంది.
- కోళ్ల అభివృద్ధి పథకంలో తక్కువ వ్యయంతో కూడిన సాంకేతికతతో వెయ్యి పెట్టలు, 100 పుంజుల సామర్థ్యం గల పెరటి కోళ్ల యూనిట్, కోడి పిల్లల ఉత్పత్తి యూనిట్, పొదుగు కోళ్ల యూనిట్‌కు రూ.50 లక్షలు, అంతకన్నా అధికంగా పెట్టుబడి అయితే రూ.25 లక్షల వరకు రాయితీ ఇస్తారు.
- పందుల పెంపకంలో 100 ఆడ పందులకు, 10 మగ పందుల గల యూనిట్, పంది పిల్లల ఉత్పత్తి యూనిట్‌లకు రూ.60 లక్షలు, అంతకన్నా విలువైన ప్రాజెక్టుకు రూ.30 లక్షల వరకు రాయితీ అందుతుంది.
- ఈ పథకంలో లబ్ధి పొందేవారికి రుణ సౌకర్యం కల్పించేందుకు బ్యాంకులు సైతం ముందుకు వస్తున్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి ఫలించింది.
- ఆర్‌బీకేల స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడం ద్వారా ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది.

## జిల్లాలో విజయవంతానికి కృషి



నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ గత నుంచి ఉన్న పథకమే అయినా ఈసారి క్షేత్రస్థాయిలో అధికంగా యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనివల్ల రైతుల ఆదాయం రెట్టింపవుతోంది. రైతులతో పాటు నిరుద్యోగ యువతకు సైతం ఈ ప్రాజెక్టు వల్ల ప్రయోజనాలు కలుగుతాయి. ఆసక్తి గల రైతులు, యువత స్థానిక పశుసంవర్ధక శాఖ అధికారుల ద్వారా యూనిట్లను పొందే అవకాశం ఉంది.

– సత్య గోవింద్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి, తూర్పుగోదావరి జిల్లా

# సంబరంగా ముగిసిన దసరా వేడుకలు



దేవీచౌక్‌లో శ్రీరాజరాజేశ్వరి దేవీ అలంకారంలో అమ్మవారు



దేవిచౌక్‌లో అమ్మవారి చిత్రపటాన్ని కలెక్టర్ దంపతులకు అందిస్తున్న కమిటీ సభ్యులు

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు, భవానీలు
- అఖరి రోజు శ్రీరాజరాజేశ్వరీ దేవిగా దర్శనం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా దసరా వేడుకలు ముగిశాయి. సోమ మంగళవారాల్లో అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో దేవిని 9వ రోజు శ్రీమహిషాసురమర్దినిగా అలంకరించారు. మంగళవారం శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో వేంచేసిన శ్రీబాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రులు చివరి రోజు కావడంతో భక్తులు దేవి దర్శనానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. విజయవాడకు వెళుతున్న భవానీ దీక్షదారులు ఇక్కడకు వచ్చి అమ్మవారి ఆశీస్సులు తీసుకుని వెళ్లారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి.

### విజయానికి ప్రతీకదసరా

చెడుపై మంచి సాధించిన విజయానికి మారుపేరుగా ఏటా దసరా నవరాత్రులు నిర్వహిస్తారని కలెక్టర్ మాధవీలత అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం దేవిచౌక్‌లోని శ్రీ బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని దేవిచౌక్ అమ్మవార్ల ఆలయానికి దర్శనీయ ప్రదేశంగా ప్రత్యేకత ఉందన్నారు. జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించామని చెప్పారు. కలెక్టర్ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

# రేపు దివాన్‌చెరువు వస్తున్న సీఎం



దివాన్‌చెరువు డీవీబీ రాజు లేవుట్‌లో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు

రాజానగరం: దివాన్‌చెరువులో జరిగే వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రానున్నారు. సీఎం హాజరుకానున్న స్థానిక డీవీబీ రాజు లేఅవుట్‌ను కలెక్టరు మాధవీలత, ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా, ఎస్పీ జగదీష్, జెసీ తేజభరత్, ఆర్డీఓ చైత్ర వర్షిణి, సీఎం సెక్యూర్టీ అధికారులు మంగళవారం సందర్శించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లను, హెలీపాడ్, రూట్ మ్యాప్ పాయింటింగ్‌లను పరిశీలించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి గురువారం ఉదయం 11.15 గంటలకు టీవీబీ రాజు లేఅవుట్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులను కలుసుకుని, 11.30 గంటలకు జక్కంపూడి గణేష్ దంపతులను ఆశీర్వదిస్తారు. అనంతరం తాడేపల్లికి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.

# మెట్టలో ముమ్మరంగా పొగాకు నాట్లు

- వర్షాలు లేక కొంతమేర జాప్యం
- ట్రే నారుకు మొగ్గుచూపుతున్న రైతులు
- గతేడాది తరహాలో లాభాలుంటాయని ఆశ



యర్నగూడెంలో వర్జీనియా పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు



దేవరపల్లి మండలం పల్లంట్లలో ఆశాజనకంగా పొగాకు నారుమడులు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో వాణిజ్య పంట వర్జీనియా పొగాకు సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడం వల్ల నాట్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. రెండు వారాలుగా నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మొక్క నాటినప్పటి నుంచి తోటలకు నీటితడులు అవసరం. దొయ్యి వేసిన అనంతరం ఎక్కువ నీరు అవసరం. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగా కురవడంతో దుక్కులు తయారు చేయడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. బోర్లు కింద పొగాకు సాగు ఎక్కువగా సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో ఉత్తర తేలిక నేలల్లో రైతులు సుమారు 55 సంవత్సరాలుగా పొగాకు సాగు చేస్తున్నారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం లోని 1,2 వేలం కేంద్రాల పరిధిలో సుమారు ఎనిమిది మండలాతో పాటు తెలంగాణాలోని రెండు మండలాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. 13594 బ్యారన్లు ఉండగా, 11313 మంది రైతులు పొగాకు సాగు చేస్తున్నారు.

ఈసారి 21426 హెక్టార్లలో పంట సాగుకు పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. రైతులు బ్యారన్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2021-22 సీజన్‌లో 18,765 హెక్టార్లలో పంట వేయగా, ఈ ఏడాది సాగు విస్తీర్ణం 21,426 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. గత ఏడాది మార్కెట్ ఆశాజనకంగా ఉంది. దీంతో సాగు విస్తీర్ణం దాదాపు మూడు వేల హెక్టార్లు పెరిగింది. గత ఏడాది 54 మిలియన్ల కిలోలు ఉత్పత్తి జరిగింది. ఈ ఏడాది 46 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వడంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. గత ఏడాది రైతులు మంచి లాభాలను పొందారు. ఈ ఏడాది కూడా సాగు లాభసాటిగా ఉంటుందనే ఆశతో ఉన్నారు. ముందుగా వేసిన తోటలకు మొదటి దఫా ఎరువులు వేస్తున్నారు. పామాయిల్ తోటల్లో కూడా పొగకును అంతర పంటగా సాగు చేస్తున్నారు.

### ఆశాజనకంగా పొగాకు నారు ధర

పొగాకు నాట్లు ముమ్మరంగా జరుగుతుండడంతో నారు ధర ఆశాజనకంగా ఉంది. ఎకరం విస్తీర్ణంలో నాటడానికి అవసరమైన(6 వేల మొక్కలు) నారు ప్రస్తుతం రూ.3500 ధర పలుకుతుంది. ట్రే నారు ధర రూ. 6500 ఉంది. ట్రే నారు వేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. ట్రే నారు నాణ్యతగా ఉండి. మాను గట్టిగా ఉండడంతో పాటు తోట వేసిన తర్వాత చీడపీడలను తట్టుకుంటుందని రైతులు అంటున్నారు. నాట్లు వేస్తున్న రైతులకు నారు ధర అందుబాటులో ఉంది.

**వేలం కేంద్రాల వారిగా సాగు వివరాలు**

| వేలం కేంద్రం | రైతులు | బ్యారన్లు | సాగు విస్తీర్ణం (హెక్టార్లు) | ఉత్పత్తి (మి.కిలోలు) |
|---|---|---|---|---|
| దేవరపల్లి | 1634 | 1868 | 2989 | 6.53 |
| జంగారెడ్డిగూడెం-1 | 2209 | 2661 | 4257 | 9.30 |
| జంగారెడ్డిగూడెం-2 | 2391 | 2579 | 4126 | 9.02 |
| కొయ్యలగూడెం | 2402 | 2718 | 4350 | 9.50 |
| గోపాలపురం | 2188 | 2629 | 4207 | 9.20 |

## ముమ్మరంగా నాట్లు



ఐదు వేలం కేంద్రాల్లో పొగాకు నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. బ్యారన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన రైతులకు అవసరమైన ఎరువులను డీసీఎంఎస్ ద్వారా బోర్డు కార్యాలయం వద్ద సరఫరా చేస్తున్నాం. నవంబరు నెలాఖరుకు నాట్లు దాదాపు పూర్తవుతాయి. ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉండడంతో నాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఈ వాతావరణం మొక్కనాటడానికి అనుకూలం. ఎక్కువ మంది రైతులు డ్రిప్ ఇరిగేషన్ ఇస్తున్నారు. బ్యారన్‌కు 35 క్వింటాళ్ల ఉత్పత్తికి అనుమతి ఉంది. దీనికి లోబడి రైతులు పంట వేసుకోవాలి. ఇప్పటి వరకు 2622 హెక్టార్లలో నాట్లు వేశారు. దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని తొర్రేడు ప్రాంతంలోను ఒరిస్సాలోని రాయగడ, విజయనగరం ప్రాంతాల్లో1238 మంది రైతులు 1768 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నారు.

– ఎస్. ఆదిశేషయ్య, రీజినల్ మేనేజరు, పొగాకు బోర్డు

## వాతావరణం గడ్డు పరిస్థితి

వర్షాలు లేక పొగాకు నాట్లు ఆలస్యంగా జరుగుతున్నాయి. భూమి దుక్కులు రావడంలేదు. ఇటు వంటి పరిస్థితి ఎప్పుడూ లేదు. మొక్క నాటి పెంచడం కష్టమవుతుందని రైతులు భయపడుతున్నారు. మరొక రెండు వారాల్లో నాట్లు పూర్తవుతాయి. ఎరువుల కొరత లేదు. పొగాకు నారు అందుబాటులో ఉంది. ఈ సమయంలో పొగాకు తోటలకు వర్షాలు అవసరం. బోర్లు నీటి మట్టం తగ్గింది. విద్యుత్ ఎనిమిది గంటలు ఇవ్వడం వల్ల తడులు అందడంలేదు.

– పిన్నమనేని మధు, అధ్యక్షులు, పొగాకు రైతు సంఘం, చిన్నాయగూడెం

## క్లుప్తంగా

### హత్యకేసులో నిందితుడి అరెస్ట్

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట గ్రామం రాయుడుపాలెం కొత్తూరు వద్ద ఈ నెల 19న గుత్తుల శ్రీను(31)హత్య కేసులో నిందితుడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుఖుమ జిల్లా మదిరియాస్ గ్రామానికి చెందిన కోసా మద్వీని కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ సోమవారం అరెస్టు చేశారు. రాయుడుపాలెం కొత్తూరు వద్ద గుత్తుల శ్రీను నివాసం ఉంటున్న ఇల్లు వెనక పోర్షన్‌లో మద్వీని ఉంటున్నాడు. శ్రీను కుట్టు మెషీన్ హెడ్ మాయమవ్వడంతో దాని విషయమై ఇరువురి మధ్య చోటు చేసుకున్న ఘర్షణ హత్యకు దారి తీసిన సంగతి విదితమే. దీనిపై మృతుడి తరఫున సింహాద్రి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిమ్మాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును సీఐ దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచడంతో రిమాండ్ విధించారు.

### రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ మంగళవారం తెలిపారు. అన్నవరం-రావికంపాడు రైల్వేస్టేషన్ల మధ్య రాజమహేంద్రవరం నుంచి తుని వైపు వెళ్తున్న రైలుబండి కింద పడి 35 సంవత్సరాల గల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న అతనిని స్థానికులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి దగ్గర ఎటువంటి ఆధారాలు లభించలేదు. శవాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చ్యురీలో భద్రపరిచారు. వివరాల తెలిసిన వారు 9494887786, 9490619020 నంబర్లలో సంప్రదించొచ్చన్నారు.

### బియ్యం వ్యాపారి హత్యలో పోలీసుల అదుపులో ముగ్గురు?

సామర్లకోట: మండలంలోని చంద్రంపాలెం గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి జల్లిగంపల తాతబ్బాయి (80) హత్య కేసులో పోలీసులు అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు నిందితులను అదుపులోనికి తీసుకొన్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి తాతబ్బాయి శనివారం రాత్రి ఇంటికి రాలేదు. ఆదివారం వరి పొలంలో తాతబ్బాయి మృతదేహం ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. మృతుడు తాతబ్బాయి కుడి చేతికి నాలుగు ఉంగరాలు, మొలసంచి (చిక్కం)లో నగదు ఉంటుందని, వాటి కోసం హత్య చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించి అనుమానించిన వారిని అదుపులోనికి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.


రావణ సంహారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్


దహనమవుతున్న రావణబ్రహ్మ బొమ్మ


రత్నగిరిపై శమీపూజ నిర్వహిస్తున్న పండితులు

# రత్నగిరిపై ఘనంగా విజయదశమి

- రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చిన అనంతలక్ష్మీ సత్యవతీదేవి, దుర్గామాతలు
- శాస్త్రోక్తంగా చండీహోమం, పూర్ణాహుతి
- రామాలయం వద్ద ఘనంగా శమీపూజ


రాజరాజేశ్వరిగా పూజలందుకున్న అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన విజయదశమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి, రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చి భక్తుల పూజలు అందుకున్నారు. దర్బారు మంటపంలో ఉదయం 11 గంటలకు చండీహోమం, పూర్ణాహుతి, రాత్రి రామాలయం వద్ద శమీపూజ ఘనంగా నిర్వహించారు. ఏసీ రమేష్‌బాబు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించారు.

**ప్రత్యేక వేదికలపై పూజలు**

సోమవారం రాత్రి రత్నగిరిపై రామాలయం వద్ద గల శమీవృక్షం వద్ద ఘనంగా పూజ నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవార్లను వెండి సింహాసనంపై, క్షేత్రపాలకులు సీతారాములను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మరో వేదిక మీద ఉంచి పండితులు పూజలు చేశారు. తరువాత శమీపూజ నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో శమీ వృక్షానికి మూడుసార్లు ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. దేవస్థానం వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠి,


శ్రీరాముడు, సీత, దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు


గంగాధరబట్ల గంగబాబు, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, దత్తాత్రేయశర్మ, పరిచారకుడు యడవిల్లి ప్రసాద్, వైదిక కార్యక్రమాల సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు, పురోహితులు నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్ కార్యక్రమాలను నిర్వహించారు.

**ఘనంగా రావణ సంహారం**

సత్యదేవుని సన్నిధిలో తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించిన దసరా వేడుకలు విజయదశమి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన రావణ సంహారం కార్యక్రమంతో ముగిశాయి. సోమవారం రాత్రి ఎనిమిది గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని వెండి గజవాహనంపై ఊరేగింపుగా జూనియర్ కళాశాల మైదానం వద్దకు తీసుకువచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రత్తిపాడు శాసనసభ్యుడు పర్వత పూర్ణచంద్రప్రసాద్ స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. అనంతరం 500 మంది పిల్లలు శ్రీరాముడు, సీతాదేవి, ఆంజనేయస్వామి, ఇతర దేవతా మూర్తుల వేషధారణలో కనువిందు చేశారు. తరువాత రావణ సంహారం కార్యక్రమం నిర్వహించారు. బాణసంచాతో రూపొందించిన సుమారు 30 అడుగుల ఎత్తు గలిగిన రావణబ్రహ్మ విగ్రహానికి గల వత్తిని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అంటించారు. చూస్తుండగానే 15 నిమిషాల వ్యవధిలో రావణబ్రహ్మ విగ్రహం పెద్ద పెద్ద శబ్దాలతో రంగులు వెదజల్లుతూ కాలిపోయింది. వేలాది మంది ఈ కార్యక్రమాన్ని తిలకించారు.

# ఏడీబీ రోడ్డులో భారీ ప్రమాదం


ప్రమాదంలో కాలిపోతున్న వాహనాలు


ఏడీబీ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

**స్తంభించిన ట్రాఫిక్**

పెద్దాపురం: విజయదశమి రోజున పెద్దాపురం ఏడీబీ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రెండు ట్రాలీ వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటన సోమవారం అర్ధరాత్రి పెద్దాపురం-రాజమహేంద్రవరం రోడ్డులో చోటు చేసుకోవడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. రెండు భారీ వాహనాలు అంటుకుపోవడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. పెద్దాపురం అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పివేశారు. ప్రాణాప్రాయం లేకపోవడంతో పోలీసులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మంచికే అంతిమ విజయం

**విజయదుర్గా పీఠాధిపతి గాడ్**

రాయవరం: తాత్కాలికంగా చెడు విజయం సాధించినా..అంతిమంగా చెడుపై మంచి ఎన్నడూ విజయం సాధిస్తుందని, ఇదే విషయాన్ని విజయదశమి పర్వదినం లోకానికి చాటి చెబుతుందని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) అన్నారు. శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా ఆయన పీఠానికి హాజరైన భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పురాణేతిహాస కాలాల నుంచి చెడుపై అంతిమ విజయం మంచికే దక్కిందన్న విషయం పలుమార్లు నిరూపితమైందన్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన చేశారు. విజయదుర్గా అమ్మవారు భక్తులకు ఉదయం మహిషాసుర మర్దిని, మధ్యాహ్నం రాజరాజేశ్వరి రూపంలో దర్శన మిచ్చారు. చీమలకొండ వీరావధాని,


రాజరాజేశ్వరి అవతారంలో విజయదుర్గా అమ్మవారు

శ్రీనివాసావధాని, కోట లక్ష్మీనారాయణ, నాగేంద్రశర్మల అర్చకత్వంలో అమ్మవారికి విశేషపూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. విజయదశమి కావడంతో భక్తులతో పీఠం కిటకిటలాడింది. హిందూ ధర్మ పరిరక్షణ సమితి రీజనల్ కో-ఆర్డినేటర్ కందర్ప హనుమాన్ తదితరులు పీఠంలో


విజయదుర్గా అమ్మవారిని, పీఠాధిపతిగాడ్‌ను ఊరేగిస్తున్న భక్తులు

పూజలు నిర్వహించుకుని పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు.

**ఘనంగా రథోత్సవం**

శరన్నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని పీఠంలోని విజయదుర్గ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి రథోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పీఠాధిపతి గాడ్‌ను ఊరేగించారు. కోలాటం, గారడీలు, మేళతాళాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ భక్తులు నిర్వహించిన ఊరేగింపు ఆద్యంతం ఆకట్టుకుంది. రాత్రి పీఠంలో శాంతికల్యాణం నిర్వహించారు.



### వ్యక్తి దుర్మరణం


సత్యనారాయణ(ఫైల్)

ధవళేశ్వరం: స్థానిక బాయ్స్ హైస్కూలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కేబుల్ ఆపరేటర్ శీలం సత్యనారాయణ(52) మృతిచెందారు. ఆయన లాక్‌లైన్ క్వార్టర్స్‌లో కేబుల్ ఆపరేటర్‌గా వ్యవహరిస్తున్నారు. మంగళవారం ద్విచక్ర వాహనంపై వేమగిరి వెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సు వెనుక చక్రం కింద పడడంతో అక్కడే మృతిచెందారు. ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# పారదర్శకంగా రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు

**రాష్ట్ర సంఘ కార్యదర్శి కృష్ణమోహన్**

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీలలో కాకినాడ శుభం కల్యాణ మంటపంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు పారదర్శకంగా జరిగాయని, పోటీల నిర్వహణలో ఎటువంటి అక్రమాలు జరగలేదని రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ పేర్కొన్నారు. మంగళవారం కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణమోహన్ మాట్లాడుతూ అసోసియేషన్‌లో పదవుల కోసం కొందరు స్వార్థపరులు చేసే కుట్రలతో భాగస్వాములైన క్రీడాకారులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి పరిశీలకుడు, జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన రిఫరీలు, 13 జిల్లాలకు గాను 12 జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారని, ఆరు విభాగాల్లో పోటీలు జరుగగా, ప్రతీ విభాగంలో పోటీల ప్రారంభం నుంచి గంటగంటకు సెమీ ఫైనల్స్ వరకు పూర్తయిన విభాగంలో నలుగురు క్రీడాకారులను ఫైనల్స్‌కు ప్రకటిస్తారన్నారు. అలా ఫైనల్స్ జరగాల్సిన వారి పేర్లు తీసుకుని వాటికి మరి కొందరి పేర్లు చేర్చి వీరే విజేతలు అని తప్పుడు లిస్టులు తయారు చేసి పోటీలలో అక్రమాలు జరిగాయని సృష్టించారన్నారు. అయితే 48 విజేతలకు గాను 30 మందికి ఇంకా పోటీలు జరగకపోవడంతో తుది జాబితా ప్రకటించడం నిర్వాహకులకు కుదరలేదన్నారు. ఈ వాస్తవాన్ని వక్రీకరించి విజేతలను ముందుగానే నిర్ణయించారనే ప్రచారం చేసి అసోసియేషన్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. ఈ దుష్ప్రచారం పై సంఘ అధ్యక్షుడు, శాప్ ఇప్పటికే విచారణ కమిటీ వేసిందని, ఎవరైనా వచ్చి తమ వద్ద ఉన్న రికార్డును మొత్తం పరిశీలించుకోవచ్చునని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతిభ కలిగిన క్రీడాకారులనే జాతీయస్థాయికి ఎంపిక చేశామని కృష్ణమోహన్ తెలిపారు. ఈ సమావేశంలో రిఫరీలు రామకృష్ణ, అరవింద్ జోష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న సంఘ కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు

### 27, 28 తేదీల్లో జిల్లా పాఠశాలల క్రీడలు, ఎంపికలు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో వివిధ క్రీడలు, ఎంపికలు జరుగుతుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ముంగండ రమేష్ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి ఈ నెల 27న అమలాపురం బాలయోగి స్టేడియంలో అండర్-17 బాలుర క్రికెట్ పోటీలు, ఈ నెల 28న అమలాపురంలోని ఆదే స్టేడియంలో అండర్-14, అండర్-17 బాలికల క్రికెట్ పోటీలు జరుగుతాయి. ఈ నెల 28న ఆత్రేయపురం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14 బాలురు, అండర్-17 బాలికల నెట్‌బాల్ పోటీలు, అదేరోజు కొత్తపేట శ్రీకాంతి ఎడ్యుకేషల్ సొసైటీ వద్ద అండర్-17 బాలురు, బాలికల షూటింగ్ బాల్ పోటీలు జరుగుతాయి. క్రికెట్ -14 బాలికలకు, షూటింగ్ బాల్ అండర్ 14 కేటగిరీలకు ఎంపికలు ఉండవని స్పష్టం చేశారు. క్రికెట్ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు సొంత కిట్లతో పోటీలకు రావాలని సూచించారు.

### గోవా నేషనల్స్‌కు ఫెన్సింగ్ క్రీడ జ్యూరీగా సతీష్‌బాబు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గోవాలో ఈ నెల 26 నుంచి నవంబర్ 9 వరకు జరిగే 37వ జాతీయ క్రీడలకు ఫెన్సింగ్ క్రీడకు స్పెషల్ జూరి (జడ్జి)గా మాజీ ఫెన్సింగ్ సంఘ కార్యదర్శి నాగం సతీష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఫెన్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ఒలింపిక్ సంఘం నుంచి ఆయన నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సేవర్ విభాగంలో (నడవడం ద్వారా పాయింట్లను సాధించే పద్ధతికి) ప్రత్యేక శిక్షణ పొందిన సతీష్‌బాబు దేశంలో ఉన్న అతి కొద్ది మందిలో ఒకరు. ఫెన్సింగ్‌లో జిల్లాకు చెందిన చదలవాడ భవానీ దేశంకు ప్రాతినిధ్యం వహించారని, ఆ స్థాయికి మిగిలిన క్రీడాకారులను తీసుకెళ్లే దిశగా సతీష్‌బాబు కృషిచేస్తున్నారని సంఘ కార్యదర్శి కృష్ణమోహన్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు జ్యూరీ గా హాజరవుతున్న సతీష్‌బాబును కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, సంఘ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్, రిఫరీ రామకృష్ణ, క్రీడాకారులు మంగళవారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

### రూ.1.30 లక్షలు పలికిన దుర్గాదేవి లడ్డు


పాడుకున్న లడ్డూను తీసుకువెళుతున్న జగన్‌బాబు దంపతులు

కొత్తపేట: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా కొత్తపేట బొరుసు వారిసావరం విజయకనక దుర్గాదేవి ఆలయంలో లడ్డూకు పాట నిర్వహించగా రాజమహేంద్రవరానికి చెందిన అడ్డగర్ల జగన్‌బాబు - పావని దంపతులు రూ.1,30,000కు పాడుకున్నారు. వారిని ఆలయ పునర్నిర్మాణకర్త బొరుసు వెంకట ఉదయభాస్కర్ - వసుధ దంపతులు అభినందిస్తూ ఆ లడ్డూను వారికి అందజేశారు.

### పవర్ లిఫ్టింగ్‌లో స్ట్రాంగ్ మెన్‌గా బాలకృష్ణ, వుమెన్‌గా శ్రేయ





బహుమతులు అందుకుంటున్న బాలకృష్ణ, శ్రేయ

అమలాపురం టౌన్: స్థానిక రాజరాజేశ్వరి కల్యాణ మంటపంలో జరిగిన తోరం రమేష్ మూడో యునైటెడ్ ఈస్ట్ గోదావరి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ మెన్, వుమెన్, మాస్టర్స్ పోటీలు ఆదివారం అర్ధరాత్రితో ముగిశాయి. వుమెన్స్, మాస్టర్స్ పోటీల విజేతలను ఆదివారం ప్రకటించగా మెన్ విజేతలను, పోటీల మొత్తం వివరాలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, పోటీల పర్యవేక్షకుడు, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు సోమవారం వెల్లడించారు. పోటీలు మొత్తం 12 కేటగిరిల్లో జరగగా విజేతలకు 12 బంగారు, 12 రజత, 12 కాంస్య పతకాలు అందించారు. పోటీల్లో టీమ్ చాంపియన్ షిప్ విన్నర్ స్థానాన్ని అమలాపురం, రన్నర్ స్థానాన్ని రాజమహేంద్రవం క్రీడాకారులు గెలుచుకున్నారు. పోటీల్లో స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన క్రీడాకారుడు ఎ.బాలకృష్ణ, స్ట్రాంగ్ మెన్ రన్నర్‌గా అమలాపురానికి చెందిన క్రీడాకారుడు ఎం.జగన్ నిలిచారు. స్ట్రాంగ్ వుమెన్ విన్నర్ స్థానాన్ని ముమ్మిడివరానికి చెందిన ఎం.శ్రేయ, స్ట్రాంగ్ వుమన్ రన్నర్ స్థానాన్ని అమలాపురానికి చెందిన పి.వందన కైవసం చేసుకున్నారు. జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు దొమ్మేటి వెంకటరమణ, గారపాటి చంద్రశేఖర్, నగభేరి కృష్ణమూర్తి, గంగుమళ్ల దొరబాబు, మట్టపర్తి వెంకట సముద్రం పాల్గొన్నారు.

### ఘనంగా ఏనుగుల సంబరం


విద్యుత్ దీపాలతో మెరిసి పోతున్న బొమ్మ ఏనుగు

రామచంద్రపురం రూరల్: ఏటా దసరా పండగను పురస్కరించుకుని ద్రాక్షారామలో నిర్వహించే ఏనుగుల సంబరం సోమ, మంగళవారాల్లో కన్నుల పండువగా నిర్వహించారు. క్రరివారి వీధి, సాక్షివారి వీధి, వెలంపాలెం బుర్రా వీధుల్లో భారీ బొమ్మ ఏనుగులను మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలలతో అలంకరించి బ్యాండు మేళాలు, కర్రసాములు, బొమ్మల వేషాలు, తీన్‌మార్ డాన్సులతో తెల్లవారే వరకు ద్రాక్షారామ, వెలంపాలెం ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఏనుగుల సంబరంలో ద్రాక్షారామ, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.